క్లుప్తంగా

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీ

యద్దనపూడి: మండలంలోని 14 గ్రామాల పరిధిలో అద్దంకి విద్యుత్‌శాఖ ఈఈ మస్తాన్ రావు, జిల్లా డీపీఈ ఆర్. విజయశ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. 30 బృందాలుగా ఏర్పడి 1650 సర్వీసులను తనిఖీ చేశారు. అదనపు లోడు వినియోగిస్తున్న వారి నుంచి రూ.49200 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ సురేష్, డివిజన్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతవరంలో మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ, యూనివర్సల్ టుబాకో సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో చెరువుకట్టలపై జామ, మామిడి, నిమ్మ, సపోటా వంటి మొక్కలను నాటారు. గతంలో ఈ సంస్థ ఆధ్వర్యంలో చెరువులో పూడిక తీయటంతో పాటు చెరువు కట్టలను పటిష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రత్నకుమార్, విక్రమ్, గ్రామస్తులు,స్థానిక రైతులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



జీఎస్టీ 2.0 అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

చీరాల: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణలో భాగంగా రాష్ట్రంలో నాలుగు వారాల పాటు నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని రవాణా శాఖ, సేల్ టాక్స్ అధికారులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆటోమొబైల్ రంగంపై జీఎస్టీ ప్రభావం తగ్గిన అంశంపై ప్రజలకు వివరిస్తూ వాహనాల ద్వారా ర్యాలీ నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు, స్టేట్ టాక్స్ అధికారి జమీర్ అహ్మద్, ఎంవీఐ రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావులు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ప్రభావంతో అన్ని రంగాల్లో తయారవుతున్న ఉత్పత్తులపై ప్రజలకు భారీ ఊరట లభించిందన్నారు. విద్య, వైద్యంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడంతో తగ్గింపులు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రజలకు నిత్యజీవితంలో అవసరమైన ఆటోమొబైల్ రంగంపై కూడా జీఎస్టీ ఉపశమనాన్ని అందించిందన్నారు. రవాణాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వానొచ్చే.. సెలవిచ్చే!

- చిన్నపాటి వర్షానికి చెరువులా మారుతున్న ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు మైదానం
- వాకర్లు, క్రీడాకారులకు తీవ్ర ఆటంకం
- క్రీడా మైదానాన్ని ఈవెంట్ హౌస్‌గా మార్చుతున్న మున్సిపల్ అధికారులు
- మైదానంలో టెంట్లు, ఇతర ఏర్పాట్ల కోసం పాడు చేస్తున్న నిర్వాహకులు



ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచి చెరువులా మారిన ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడామైదానం

చీరాల రూరల్: ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలులోని క్రీడా మైదానం వర్షాకాలంలో వాకర్లు, క్రీడాకారుల సహనాన్ని పరీక్షిస్తోంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు క్రీడా మైదానం చెరువులా మారిపోతోంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్ర సమయాల్లో వాకర్లు, క్రీడాకారులు, విద్యార్థులు వందల సంఖ్యలో పలు రకాల ఆటలాడుతుంటారు. సెలవుల్లో అయితే కిటకిటలాడుతూ ఉంటుంది. కొన్నిచోట్ల ఎత్తుపల్లాలుగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసినా నీళ్లు నిలిచిపోతున్నాయి. కొన్నిచోట్ల వాకింగ్ ట్రాక్‌పై ఎర్రమట్టి కొట్టుకుపోయి నునుపుతేలిన రాళ్లు బయటపడుతున్నాయి. వాకర్లు, క్రీడాకారులు ట్రాక్‌పై వాకింగ్, జాగింగ్‌లు చేసే సమయంలో రాళ్లు తట్టుకుని పడుతూ గాయాలపాలవుతున్నారు.

డబ్బే పరమావధిగా..

చీరాలకు ఉన్న ఏకైక క్రీడా మైదానం ఇదొక్కటే కావడం గమనార్హం. గతంలో వీఆర్ఎస్అండ్‌వైఆర్ఎన్ కళాశాలలో పెద్ద క్రీడా మైదానం ఉండేది. అయితే ఆ కళాశాల యాజమాన్యం యలమంచిలి గ్రూపుకు లీజుకు ఇచ్చింది. దీంతో క్రీడా మైదానానికి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేసి తాళాలు వేసుకున్నారు. దీంతో, వాకింగ్, ఇతర క్రీడలు ఆడుకునే వారికి ఇబ్బందిగా మారిపోయింది. కాగా ప్రస్తుతం పట్టణంలో ఉన్న ఏకైక క్రీడామైదానం ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలులోని క్రీడా మైదానమే. కానీ అధికారుల నిర్లక్ష్య నీడలో కొట్టుమిట్టాడుతోంది. పట్టణంలో ప్రముఖుల పెళ్లిళ్లు జరిగినా.. పండుగలు వచ్చినా, క్రీస్తు సువార్త సభలు జరిగినా.. ఎగ్జిబిషన్‌లు పెట్టేందుకు, రాజకీయ నాయకులకు సంబంధించిన సభలు, సమావేశాలు పెట్టాలన్నా ఈ మైదానాన్ని మున్సిపల్ అధికారులు రోజువారీగా లీజుకు ఇచ్చేస్తున్నారు. లీజుకు తీసుకున్నవారు మైదానంలో ఇష్టానుసారంగా గుంతలు తవ్వుతూ ఎగుడుదిగుడుగా మార్చేస్తున్నారు. దీపావళి పండుగకు మైదానంలో టపాసుల అమ్మకం కోసం కూడా మైదానాన్ని లీజుకు ఇచ్చేస్తారు. ఇక దుకాణదారుల ఇష్టంవచ్చినట్లు టెంట్లు వేసుకుంటూ మైదానంలో పెద్ద గోతులు తవ్వుతుంటారు. దసరా పండగకు పారువేట నిర్వహించారు. గోవులను కట్టేసేందుకు కూడా మైదానంలో గుంతలు తవ్వారు. ఈ పరిణామాలన్నీ క్రీడా మైదాన విశిష్టతను దెబ్బతీస్తున్నాయి.

అధికారులు దృష్టి సారించాలి



ఎంతో విశిష్టత కలిగిన ఈ క్రీడామైదానం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా పాడై పోతోంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో క్రీడాకారులు, వాకర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, రకరకాల క్రీడలు ఆడుతుంటారు. కొద్దిపాటి వర్షంపడినా మైదానం మొత్తం నీళ్లు నిలిచిపోయి చెరువులా మారిపోతోంది. వర్షం దాటికి ఎర్రమట్టి గ్రావెల్ కొట్టుపోయి రాళ్లు బయటపడుతున్నాయి. ఆ రాళ్లు కాళ్లకు గుచ్చుకుని ప్రమాకరంగా మారుతున్నాయి. ఇకనైనా అధికారులు మైదానంపై శ్రద్ధచూపి సమస్యను పరిష్కరించాలి.

పోలుదాసు రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

కోటి సంతకాలతో కూటమి కళ్లు తెరిపిద్దాం



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు



అద్దంకిలో కోటిసంతకాల సేకరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీరాల: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు తలపెట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంతో కూటమి ప్రభుత్వ కళ్ళు తెరిపిద్దామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ బాబు అన్నారు. గురువారం పట్టణంలోని 7వ వార్డులో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రజా ఉద్యమ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏడో వార్డు ప్రజలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం ఉచితంగా విద్యనందించడానికి మన బడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తే నేటి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం కూటమి నాయకులకు పేదల పట్ల ఉన్న శ్రద్ధ ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. కూటమి నిర్ణయంతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే ఫీజులు కూడా అధికంగా ఉంటాయని, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. వార్డుల్లో, గ్రామాల్లో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. అనంతరం వార్డుల్లోని ప్రజలతో ఆయన మాట్లాడి కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. వార్డులోని ప్రజలు కూటమి నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతకాలు చేస్తున్న మహిళలు

అద్దంకి రూరల్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసన అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక, 2 వార్డులో కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ సంతకాలను సేకరించారు. వార్డు కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీయుజ మాసం మఘ ఏకాదశి శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జీఎస్టీ సవరణతో అన్ని వర్గాలకు మేలు



ర్యాలీలో మాట్లాడుతున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్

అద్దంకి రూరల్: జీఎస్టీ సవరణ అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగమని రవాణా శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి. మల్లికార్జునరావు అన్నారు. గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలవకూరు రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జీఎస్టీ సవరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగానికి, అత్యవసర ఔషధాలు సహా దాదాపు 90 శాతం వస్తువులపై 10 నుంచి 18 శాతం జీఎస్టీ తగ్గించి దేశప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వం దీపావళి కానుకనిచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్బరాజు, ఏఎంవీఐ బి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కరణం వెంకటేష్ బాబు

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం!

- మృతుల కుటుంబాలను పరామర్శించిన వెంకటేష్‌బాబు

చీరాల: వాడరేవు సముద్రతీరంలో సముద్ర స్నానం చేస్తూ అలల ఉధృతికి గల్లంతై మృతి చెందిన వడ్డె సంఘానికి చెందిన కూచన షారోన్, కోట గౌతమ్ కుటుంబ సభ్యులను గురువారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు పరామర్శించారు. యువకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ఆసరాగా ఉంటారనుకున్న బిడ్డ దూరమైతే ఆ బాధ వర్ణించలేనిదని, వారు లేని లోటు తీర్చలేనిదని, అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి గోసాల అశోక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లో వరదగా పారుతున్న సాగర్ నీరు



మైనర్ కాలువ తూములు పూడిపోవడంతో వరదలు మరిపిస్తున్న సాగరు నీరు

జె.పంగులూరు: అధికారుల నియంత్రణ లేక సాగరు కాలువ నీరు పొలాల్లో వరదలా ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొంతకాలంగా కోటపాడు, కొండమంజులూరు గ్రామాల మధ్య ఉన్న కోటపాడు మైనర్ కాలువ తూములు పూర్తిగా ఊడిపోవడం వలన సాగరు కాలవల్లో ప్రవహించే నీరు పొలాలపై పడుతోంది. రైతుల వ్యవసాయం చేసుకునేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై కోటపాడు, కొండమంజులూరు గ్రామాలకు చెందిన రైతులు పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇటీవల సాగరు కాలువకు నీరు రావడంతో మళ్లీ పొలాలపై పడ్డాయి. వరదలు తపలపించే విధంగా సాగరు నీరు పొలాల్లో ప్రవహిస్తున్నాయి. పొలాల్లో నీరు ఈ విధంగా ప్రవహించటం వలన తాము వ్యవసాయ పనులు ప్రారంభించలేకపోతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి ప్రవాహం సాఫీగా జరిగే విధంగా తూములు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

జీవ ఎరువులతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ డాక్టర్ అచ్యుతరాజు

చీరాల: జీవ ఎరువులు ఉపయోగించడం వలన రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని బాపట్ల ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుతరాజు అన్నారు. గురువారం చీరాల రూరల్ మండలం తోటవారిపాలెంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులు వాడడం వలన పంటలో నత్రజని, పొటాషియం శాతాన్ని పెంచవచ్చని, రసాయన ఎరువులు లేకుండా మొక్కకు పోషకాలను అందించవచ్చన్నారు. జీవన ఎరువులు కావాల్సిన రైతులు ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

జె.పంగులూరు: పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు వారి సమస్యలపై చర్చించుకున్నారు. అనంతరం అందరి ఏకాభిప్రాయంతో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షునిగా తన్నీరు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి షేక్ రహతుల్లాను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆరే శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా కేవికే నరసింహమూర్తి, కంకణాల శ్రీనివాసరావు, బాచిన లలిత కుమారి, రావూరి వెంకట సుబ్బారావుని ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ ఎన్నిక అధికారిగా కరి రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు చెంచు రామారావు, రాష్ట్ర కౌన్సిలర్ జంపాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దల సభ కోసం పేదల పాట్లు



కిక్కిరిసిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు



బస్సులు లేక వెలవెలపోయిన అద్దంకి బస్టాండ్

- కర్నూలు తరలిన బస్సులు
- బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ప్రయాణికులకు అవస్థలు

బల్లికురవ: స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినా ఏం లాభం? ఉన్న బస్సులను ప్రధాని మోదీ సభ కోసం కర్నూలు తరలించటంతో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ప్రయాణికులు, వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు పడరానిపాట్లు పడుతున్నారు. గురువారం సూపర్ జీఎస్టీపై ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు ఈ రెండు మండలాలో తిరిగే వివిధ డిపోలకు చెందిన పల్లెవెలుగు బస్సులను బుధవారం ఉదయమే తరలించారు. శుక్రవారం మధ్యాహ్నానికి తిరిగివచ్చే అవకాశం లేదు. అద్దంకి డిపో నుంచి బల్లికురవ మీదుగా నరసరావుపేట, చిలకలూరిపేట, మైలవరం వెళ్లే బస్సులకు పూర్తిగా రద్దు చేశారు. అద్దంకి డిపో నుంచి కొప్పరపాడు, కూకట్లపల్లి మీదుగా వినుకొండ వెళ్లే బస్సు, కొప్పరపాడు, కొమ్మాలపాడు, సంతమాగులూరు మీదుగా నరసరావుపేట వెళ్లే బస్సులకు కోత విధించారు. వినుకొండ డిపో నుంచి సంతమాగులూరు మీదుగా నరసరావుపేట, నరసరావుపేట నుంచి అద్దంకి, ఒంగోలు వెళ్లే బస్సులకు కోత విధింటంతో శుక్రవారం వరకు ప్రయాణికులకు ఈ కష్టాలు తప్పే పరిస్థితులు లేవు. సింగిల్ రూట్‌లో బస్సుల రద్దుతో ప్రమాదభరితంగా ప్రయాణం సాగిస్తున్నారు.

బస్సుల రద్దుతో పాట్లు..

బస్సుల రద్దు, కుదింపుతో బుధ, గురువారాల్లో మహిళలు, వృద్ధులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. బస్సువస్తే చాలు అన్నట్లు ఎగబడి ఎక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక గత 15 నెలల్లో అమరావతి, అనంతపురం, కర్నూలులో సభల పేరిట ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి ప్రతి సభకు వివిధ డిపోల నుంచి 200 బస్సులను ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 250 బస్సుల వరకు పల్లెవెలుగు కేటాయిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే బస్సులను రద్దు, కోతలు విధిస్తున్నారు. బుధవారం నుంచి అద్దంకి, నరసరావుపేట, వినుకొండచిలకలూరి పేట డిపోల్లో ప్రయాణికులకు నిరీక్షణ తప్పటంలేదు.

ఇంకొల్లు(చినగంజాం): నియోజక వర్గంలోని పర్చూరు, చినగంజాం, ఇంకొల్లు కారంచేడు మండలాల్లో బస్సులు సక్రమంగా రాక పోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇంకొల్లు బస్టాండ్ 40 గ్రామాలకు కూడలి కాగా నిత్యం 40కి పైగా బస్సులు తిరుగుతూ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. కానీ బుధవారం ఇంకొల్లు బస్టాండ్‌కు కేవలం 7 బస్సులు మాత్రమే రావడంతో బస్టాండు ప్రాంతమంతా వెలవెలబోయింది.



ప్రయాణికులకు బస్సులు లేకపోవడంతో వెలవెలబోయిన ఇంకొల్లు బస్టాండ్

పల్లె వెలుగులు రద్దు చేయడమేమిటి?



ప్రభుత్వం ఒక వైపు స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ మరో వైపు ఉన్న బస్సులను సభలకుత తరలించడం దారుణం. బస్సుల రద్దుతో ప్రమాద భరితమైన ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. భవిష్యత్‌తోనైనా ఇలా బస్సుల కేటాయింపును విరమించుకోవాలి.

తంగిరాల వెంకటేశ్వర్లు, వామపక్షాల నాయకుడు

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్ విధానాన్ని విద్యార్థులకు బోధిస్తున్న వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): పాఠశాల విద్యార్థులు సైతం సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఇన్‌చార్జ్ వైద్యాధికారి, ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలియజేశారు. చెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన సీపీఆర్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని, విద్యార్థులకు సీపీఆర్ ప్రక్రియ విధానాన్ని ఆచరణలో చూపుతూ బోధించారు. ఎప్పుడైతే ఒక వ్యక్తి అపస్మారకంగా గుండె కొట్టుకోకుండా ఊపిరి తీసుకోకుండా స్పందన లేని స్థితిలో ఉంటాడో అప్పుడు ఛాతీ ఎముకపై మన రెండు చేతుల్ని ఇంటర్ లాకింగ్ చేసి నిమిషానికి 100 నుంచి 120 సార్లు రెండు ఇంచులు లోతుకి మోచేతులు దగ్గర వంచకుండా బలంగా నొక్కాలని తెలిపారు. ప్రతి 30 కంప్రెషన్‌లకు రెండు సార్లు అపస్మారకంగా ఉన్న వ్యక్తి నోటిలో గాలి ఊదాలని ఆ విధంగా వ్యక్తి స్పృహలోకి వచ్చే దాకా లేదా అంబులెన్స్ లేదా వైద్యుల వచ్చేంతవరకు చేస్తూ ఉండటం వల్ల ప్రతి నలుగురిలో ఒక్కరిని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సత్యనారాయణ, స్టాఫ్ నర్స్ చంద్రశేఖర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.